# నిజమే చెపితే?

యం.యస్.చలం

[అసత్యమాడటం మహా పాపకరమైన విషయమే కావచ్చును. కాని ప్రపంచమంతా అసత్యవాదుల మయమైపోయినప్పుడు యే మారుమూలలనైనా కొలది మంది సత్యవాదులే గనుక మిగిలివున్నట్లయితే వాళ్లు తప్పనిసరిగా యీ అసత్యవాదుల బాధకు గురికావలసి వుంటుంది. రెండు భయంకర హత్యాపరాధాలు మోపబడ్డ వ్యక్తి మీ సమక్షాన నిలబడినప్పుడు మీరు వుపేక్షాభావం వహించగలరా? అతడు హత్యలకు నేను కారకుడనుకానని నిజమే చెప్పినా మీరు యదార్థమని నమ్మి జాలిచూపగలరా? ఆహత్యాపరాధిని ప్రభుత్వానికి వప్పగించి మరణశిక్ష విధించాలనే సంకల్పం మీకు వుండదా? అయితే వినండి.]

★

ధనవంతుల జాబితాలో నా యజమానికికూడ ప్రముఖస్థానంవుంది. కొన్నిలక్షల రూపాయలకు ఆయన అధిపతి. తన ఔన్నత్యందాటే పెద్ద కర్మాగారాలువున్నవి. దూరపు గ్రామాల్లో కొంత భూమి కూడా వున్నదని వినికిడి.

ఎందరెందరో ఆయనవద్ద ఋణరూపంగా చేతులుచాస్తారు. మరికొందరు యాచకరీత్యా చేతులు చాస్తారు. అదృష్టవంతులు ఫలితాన్ని కొనిపోవటం, దురదృష్టవంతులు రిక్తహస్తాలతో మళ్లిపోవటం జరుగుతూంటుంది. సమాజంలో ధనికునకువుండే గౌరవ మర్యాదలూ, పొగడ్తలు, యిత్యాదులన్నీ ఆయనకువున్నై. వీటితోపాటు దూషించి ద్వేషించే ప్రజానీకంకూడా లేకపోలేదు.

ఆయన బాకీదార్లలో కొందరు వడ్డీసహా ఋణవిముక్తి చేసుకుంటూరు. వీరు వడ్డీలో సైతం కొంతభాగం రాయితీ చేయమని కోరరు. కాని తనకు తానుగా తగ్గించలేదనే ద్వేషభావం వీరిలో మిగిలిపోతుంది. తీర్పు లేక కోర్టులకు యీడ్వబడి, వున్న ఆస్తిని జప్తు చేయించుకొనే వారంతా బద్ధవిరోధులు యింకా యితర కార్యకలాపాల్లో ప్రతికక్షిగావుంటున్నారని కొందరి ధనికుల్లోకూడా విరోధభావం వుంది.

దాదాపు పదేళ్లుగా నేను వారికొలువులో వుంటున్నాను. ఇంటి పనులు చక్కబెట్టే పరిచారకా బృందములో నేనుకూడా ఒకణ్ణి. అయితే మిగతా సేవకులందరూ నాకన్న ముందు పనికి కుదిరిన వాళ్లే.

ఆనాటి రాత్రి పనివాళ్లంతా యిండ్లకు వెళ్లిపోయారు. గదిలో సామాను సర్దుతూ నేను వుండిపోయాను. నాయజమాని పడక గదినుండి మూల్గు వినిపించింది. మృత్యుగహ్వరంనుండి విలపించే ప్రాణి ఆర్తనాదమది!

కలవరపాటుతో ఆగదికి వెళ్లాను. నాకనులు మిరిమిట్లుగొల్పినై. భయాశ్చర్య సంభ్రమాలతో సమీపించి చూచాను. గుండెలమీద బాకుపోట్లు

వున్నై. ఆగాయాలనుండి రక్తంచిమ్మి పరిసర ప్రాంతాలమీద పడుతోంది. నా దుస్తులుకూడ రక్తంతో తడిసినై. దీర్ఘనిద్రవు దారితీసే ఆ కళ్లు నావంక బాధగా చూచినవి. పెదవులు ఏమో చెప్పాలని కదలినవి; కాని ఆ పెదవులనుండి యేవిధమైన శబ్దము రాలేదు. కొద్దిసేపటిలోనే ఆయన యిహలోకలీల చాలించాడు.

నా బట్టలుమీద రక్తం చిమ్మిన కారణంగా నన్ను దోషిగా నిర్ణయించాడు న్యాయాధిపతి. తత్ఫలితంగా నాకు యావజ్జీవ కారాగారవాసశిక్ష విధించబడింది.

నేను అనుభవించవలసిన శిక్ష యెంత కఠినమైనదో తలపుకొచ్చేసరికి నిలువునా క్రుంగిపోయాను. కనీసం మరణశిక్ష విధింపబడినా విచారించివుండేవాణ్ణికాదు! నిత్యం అనేకమంది మనుష్యులు బలవన్మరణానికి గురి అవుతూండటం ప్రత్యక్షంగా కనుపించే విషయమే; అయితే, వాళ్లు యేక్షణకాలమో బాధపడి శాశ్వత సౌఖ్యాన్ని హత్తుకుంటారు. నేను మాత్రం క్షణక్షణం చనిపోవటంవంటి యావజ్జీవ కారాగారవాసం అనుభవించాలి. ఇది మానవ జన్మ ఎత్తిన యేప్రాణికూడా భరించ శక్యంకాని బాధాకర విషయం.

నిర్దోషి దోషిగా శిక్ష ననుభవించడం లోకానికి నేను తొలివాణ్ణికాకపోవచ్చు; కాని దోషిగా నేను ప్రాయశ్చిత్తాన్ని పొందుతున్నాననే ఆత్మసంతృప్తి యెలా లభిస్తుంది?

ఆధ్యాత్మిక వాదులంటారు—"నీ పూర్వజన్మ పాపానికి ఫలం అనుభవిస్తున్నావు; నీపాపం నిశ్శేషం అవుతుంది" అని. ఎలానమ్మటం? విపత్తులో పడి దుఃఖంలో అలమటించే తోటిమానవుని మనశ్శాంతికోసం అలా ఓదార్చుతారనిపిస్తుంది!

నాజీవితం అయిదేళ్లు జైలులో గడచింది. గుండువరటి నా శరీరం శుష్కించిపోయింది. ప్రక్కటెముకలు లెక్కించడానికి వీలుగా బైటపడ్డవి. కొంచెందగ్గుకూడా ఆవహించింది. కొద్దిరోజుల్లో అది క్షయగామారి మృత్యుసన్నిధికి గొనిపోతుందనే నమ్మకంకూడా కలిగింది.

ఈ అయిదేళ్ళలోను నాకనేకమంది కొత్త మిత్రులు లభించారు. వాళ్ళ జీవితవిశేషాలను వింటోంటే ఆనందంగా వుండేది. నా విషాదజీవితాన్ని విస్మరించడానికి వాళ్లెంతో సహాయభూతులయ్యేవారు. శిక్షాకాలం పూర్తికావటంతో వాళ్లు నావంక జాలిగాచూచి సెలవుతీసుకునేవారు: విడిపోయే నామిత్రులకు యేమేమో చెప్పాలనివుండేది; కాని నోటమాటవచ్చేదికాదు. దుఃఖం పొంగిపొరలి కన్నీళ్ళరూపం ధరించేది.

ఆరాత్రి... నేను జైలునుండి విముక్తిపొందిన రాత్రి... నక్షత్రభూషిత నీలాకాశం నల్లని కారుమబ్బులను హత్తుకుంది. వర్షానికిముందు వీచే చల్లని గాలివీస్తోంది. మిణుగురులకాంతికూడా లేదు. దూరాన కప్పల బెకబెకల ప్రకృతినిశ్శబ్దతను ఛేదిస్తున్నది.

పండ్రెండు గంటలకల్లా నాకు మోగన్నుగా నిద్రపట్టింది. కెవ్వుమన్న కేకతో త్రుళ్ళిపడిలేచాను. నాపాదాలముందు తాళపుచెవులగుత్తి పడివుంది. నాగదికి అమర్చిన యినుపచువ్వల ద్వారమునకు తల ఆన్చి యెవరోవ్యక్తిపడి తన్నుకుంటున్నాడు. ఆకాశంనుండి వచ్చిన మెరపుకాంతిలో అతణ్ణి గుర్తించాను, జైలువార్డర్!

తలుపుతెరచి అతణ్ణి సమీపించాను. కపాలం పగిలి రక్తం ధారగా ప్రవహిస్తోంది. కొద్దిసేపటిలోనే అతడు యీలోకాన్ని విడిచిపెడతాడనడానికి యేమాత్రం సందేహంలేదు. ఆపైన యీ హత్యకూడా నాపై మోపబడుతుంది! నామనస్సు పారిపోవలసిందిగా వేగిరపెట్టింది.

వార్డర్ చేతుల్లోంచి జారిన తాళంచెవుల సహాయంతో నేను ముక్తజీవినయ్యాను.

ఈనాడు ఆకాశపు రంగుతెరలు—సెలయేళ్ల కులుకుపరుగులు—పువ్వుల మిసిమిసినవ్వులు-ఇవన్నీ నాకు కూడా తెరువబడేవున్నై. కాని మీకూ నాకూ ఒకటే భేదం. అవి మీరు స్వేచ్ఛగా అనుభవించగలరు. మరి నేనో—చాటున మాడవ కంటి వానికి కనిపించకుండా కొండగుట్టలమీదా, రైళ్ళ వంతెనలక్రిందా ఉండిమాత్రమే అనుభవించడానికి వీలవుతుంది.

ఎవరితోనైనా మాట్లాడడమంటే భయం వేస్తుంది. కాగితంముక్క కనుపించినా భీతితప్పదు! ఎందుకంటే వెనుక యెక్కడో కారపుశెనగలు కొనుక్కున్న పొట్లపుకాగితంచూస్తే— అందులో నాబొమ్మవేసి పట్టియిచ్చినవాళ్ళకు వేయిరూపాయలు బహుమానమిస్తామని పోలీసువాళ్ళ ప్రకటనవుంది!

ఇలామారింది నాబ్రతుకు. ఈనాటే నేను వెళ్ళి యీమాటలే—నా యజమానినికాని, జైలు వార్డరునుకాని చంపినది నేనుకాదని ప్రభుత్వంముందర నిజమేవెల్లడిస్తే విశ్వసిస్తుందా? కనీసం మీరైనా విశ్వసిస్తారా? సత్యాన్ని సత్యమని చెలామణి చేయించడం దుష్కరమైన యీ కాలంలో చెయ్యనితప్పులకు శిక్షననుభవిస్తూ యిట్లా తిరుగుతున్నాను. ఐతే ఒకటి— కారాగృహంలోకంటె విశేషించి యీనాడు నేనేమైనా స్వేచ్ఛను పొందగలనా అన్నదే నాసందేహం!


# మధుర ధనలక్ష్మి స్టోర్సు వారిచే

తయారుచేయబడిన:

రెడీమేడ్ దుస్తులను

అందరూ ధరించండి.

●

అమ్మకపు యేజంట్లు

అన్నిచోట్లా కావలెను.

●

వివరములకు :

**Dhanalakshmi Stores,**

Jadamuni Kovil St., MADURA.

*Sales Depot :—*

**SUNDARAM STORES,**

**MADURA & MADRAS.**

